క్లుప్తంగా

సీఎం జగన్, పేర్ని నాని చిత్రపటాలకు క్షీరాభిషేకం



మచిలీపట్నం టౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్లు రూ. 3 వేలకు పెంచి పంపిణీ చేయటంతో నగరంలోని 8వ డివిజన్‌లో పింఛనుదారులు హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని నాని చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ శ్రీరాం లక్ష్మణకుమార్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరుగుతున్న క్రమంలో అక్కడున్న పింఛనుదారులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి అభిమానం చాటుకున్నారు. సీఎం జగన్ తమకు పింఛను పెంచుతూ పంపిణీ చేస్తుండటం వల్లే మా వంటి పేద వారం జీవించగలుగుతున్నామని, సీఎం జగన్‌కు మరో సారి ఓటు వేసి రుణం తీర్చుకుంటామని చెప్పారు.

చేనేత క్యాలెండర్ ఆవిష్కరణ

పెడన: ఏపీ చేనేత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్వోదయ చేనేత సొసైటీలో మంగళవారం అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆనందప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాల ప్రసాద్, ఏపీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు కట్టా హేమ సుందరరావు, కోదాటి నారాయణరావు, పేరిశెట్టి ఉమాకాంతం, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ సర్వీస్ ప్రారంభం

కృత్తివెన్ను: లక్ష్మీపురం లాకుల మీదుగా సమీప గ్రామాలను కలుపుతూ నూతన ఆర్టీసీ బస్ సరీ్వసును మంగళవారం విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ ప్రారంభించారు. స్థానికుల అభ్యర్థన మేరకు తాను చైర్మన్‌గా ఎంపికైన వెంటనే ఈ బస్ సర్వీసును ప్రారంభించామని మహేష్ తెలిపారు.

జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థులు

నాగాయలంక: జన విజ్ఞాన వేదిక కో–ఆర్డినేటర్ డాక్టర్ రామిశెట్టి శంకరానంద్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. నాలుగు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా మండల పరిధిలోని తలగడదీవి ఉన్నత పాఠశాల టీమ్ ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. నాగాయలంక హైస్కూల్ టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. నిర్వాహకులను, విద్యార్థులను సైన్స్ టీచర్ పద్యాల రఘురామయ్య అభినందించారు. సామాజికవేత్త తలశిల రఘుశేఖర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోలాహలంగా పైడమ్మ దేవస్థానం

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి దేవస్థానం మంగళవారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఎనిమిదో రోజుకు చేరాయి. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. శిడిబండ్లకు బొమ్మలు కట్టి సుందరంగా అలంకరించి మేళతాలాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ, దేవదాయ శాఖ ఈఓ టీవీవీ మోహనరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

రసాయనశాస్త్రంలో పరిశోధనకు డాక్టరేట్



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగంలో పూర్తి సమయం పరిశోధన విద్యార్థిగా పనిచేస్తున్న గచ్చకాయల నరేష్ బాబుకి సూక్ష్మ రసాయనశాస్త్రంలో చేసిన పరిశోధనలకుగాను మంగళవారం విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ జి. జ్ఞానమణి డాక్టరేట్ పట్టాను అందజేశారు. కృష్ణా విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి. రామశేఖరరెడ్డి పర్యవేక్షణలో మూడేళ్లుగా తన పరిశోధనలపై ఆరు పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా నరేష్ బాబును పలువురు అభినందించారు.

పెన్షన్ల పెంపుతో వృద్ధులకు ఆసరా

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఘంటసాల(అవనిగడ్డ): ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ పెంచి వృద్ధులకు ఆసరాగా నిలిచారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు కల్లబొల్లి మాటలు చెప్పారని, ఇప్పుడేమో అధికారంలోకి వస్తే అన్నీ చేసేస్తామని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. గతంలో పెన్షన్ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడేవారని, నేడు ఒకటో తేదీన తెల్లవారు జామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపుతట్టి పెన్షన్లు ఇస్తున్నారని చెప్పారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఎంపీపీ వేమూరి రజనీకుమారి, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఎంపీడీఓ అనూహ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● **కృత్తివెన్ను:** ఇచ్చిన మాటను నిలబెట్టుకునే మంచి మనస్సున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. మంగళవారం కృత్తివెన్నులో పింఛన్లను నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. మండల వ్యాప్తంగా 7,220 మంది పింఛన్‌దారులకు గాను మొత్తం రూ. 2.16 కోట్లను పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, మండల కన్వీనర్ వెంకట్రాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, జేసీఎస్ మండల కమిటీ చైర్మన్ బాపూజీ, జాన్‌రత్నం తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



కృత్తివెన్నులో పింఛన్లు పంపిణీ



మోపిదేవిలో పెన్షన్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



బందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణెమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ నిరీష

అవనిగడ్డ నియోజకవర్గంలో 725 కొత్త పెన్షన్లు..

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమైంది. నియోజకవర్గంలో మొత్తం 725 పెన్షన్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి రూ.21.75లక్షల పంపిణీ చేయనున్నారు. వీటిలో వృద్ధాప్య పెన్షన్లు 243 ఉండగా, వితంతు 220, దివ్యాంగులు 261, సింగిల్ ఉమెన్ ఒకటి ఉన్నాయి. అవనిగడ్డ మండలంలో మొత్తం 327 పెన్షన్లు మంజూరు కాగా, చల్లపల్లిలో 155, ఘంటసాలలో 86, కోడూరులో 124, మోపిదేవిలో 104, నాగాయలంక మండలంలో 129 పెన్షన్లు కొత్తగా మంజూరయ్యాయి.

● **మచిలీపట్నంటౌన్:** నగరంలోని 49, 50వ డివిజన్లకు చెందిన ఇరువురు పింఛన్ దారులు అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీర్లు ఆస్పత్రికి వెళ్లి పింఛన్లు అందజేశారు. 50వ డివిజన్‌కు చెందిన శనగవరపు శ్రీలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శ్రీలక్ష్మికి వలంటీర్ అనుమకొండ కోమలి పింఛన్ సొమ్ము అందజేసింది. 49వ డివిజన్‌కు చెందిన బురక మణెమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమెకు వలంటీర్ నిరీష పింఛను సొమ్మును ఆస్పత్రికి వెళ్లి అందజేసింది.

పింఛన్లు తంచనుగా అందిస్తున్నాం..

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు పింఛన్ తంచనుగా అందిస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో వైఎస్సార్ పింఛన్ కానుక సభ జరిగింది. ఎమ్మెల్యే విచ్చేసి పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల పేదలకు మేలు కలుగుతుందన్నారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని), సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, డొక్కు నాగేశ్వరరావు, మాతంగి రమ్య, వల్లూరు ఉమా, పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు ఫణి, పేరం నాగిరెడ్డి, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, మహమ్మద్ షాహెదాబేగం, నూకల వెంకటేశ్వరరావు, ఈడీఆర్డీ బూరేపల్లి అశోక్, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నజరానా, ఆగ్రో డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

● **మచిలీపట్నంటౌన్:** మంగళవారం ఉదయం నుంచి నగరంలోని అన్ని క్లస్టర్ల వలంటీర్లు వారి పరిధిలోని పింఛనుదారులకు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఇన్‌చార్జ్‌లు, గృహ సారథులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. నగరంలో మొత్తం 19,242 పింఛన్లు ఉండగా వీరిలో 15,542 మంది పింఛనుదారులకు రూ. 3 వేల పింఛనును అందజేశారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 19,224 పింఛన్లు ఉండగా వీరిలో 139 మంది అభయహస్తం, ల్యాండ్ లెస్ పూర్ 1, సీకేడీయూ 40, డప్పు కళాకారులు 25, వికలాంగ 3,295, డీఎం అండ్‌హెచ్‌ఓ పింఛన్లు 176, మత్స్యకారులు 530, వృద్ధాప్య 8,111, కళాకారులు 11, సైనిక్ వెల్ఫేర్ 6, ఒంటరి మహిళ 870, కల్లుగీత 46, చర్మకారులు 80, ట్రాన్స్‌జెండర్లు 7, వీవర్స్ 207, వితంతు పింఛన్లు 5,698 ఉన్నాయి. వీరందరికీ ఈ నెలలో రూ. 5.80 కోట్ల మేర నగదును పంపిణీ చేయనున్నారు.

పెన్షన్ రూ. 3 వేలకు పెంపు..

మోపిదేవి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ. 3 వేలకు పెంచి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వం పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ రావాలంటే పింఛన్ పొందేవారు మృతిచెందాలని, లేకుంటే జన్మభూమి కమిటీ సిఫారసులు పనిచేసేవని చెప్పారు. మండలంలో సామాజిక భద్రత పింఛన్లు జనవరిలో పెరిగిన 104తో పాటు మొత్తం 6,435 మందికి నెలకు సుమారు రూ. 2 కోట్లు వస్తున్నాయని, ఏడాదికి రూ. 24 కోట్లు అందించడం జరుగుతుందని వివరించారు. తొలుత ముఖ్యమంత్రి సందేశాన్ని ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు చదివి వినిపించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, తుమ్మా సోములమ్మ, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారు



నాకు ఇద్దరు కుమారులు. వారికి వివాహాలు జరిగాయి. వారి కుటుంబాలతో జీవిస్తున్నారు. నా భర్త, నేను వేరుగా జీవనం సాగిస్తున్నాం. సీఎం జగన్ నా భర్త సాంబశివరావుకు వికలాంగ పింఛను, నాకు వృద్ధాప్య పింఛను అందిస్తూ ఆదుకుంటున్నారు. ఈ పింఛను సొమ్ముతో మందులు కొనుక్కోవడంతో పాటు జీవనం సాగిస్తున్నాను. అందుకే సీఎం జగన్ మా పెద్దకొడుకులా మారాడు.

– తాడికొండ రంగనాయకమ్మ, రాజుపేట

హామీ నెరవేర్చారు



సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చారు. పింఛను సొమ్మును రూ. 3 వేలకు పెంచుతానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఈ హామీని నెరవేర్చి పింఛనుదారుల పట్ల ఆయనకు ఉన్న ప్రేమాభిమానాలు చాటుకున్నారు. పింఛను సొమ్ముతోనే ఒంటరి మహిళనైన నేను ధైర్యంగా జీవిస్తున్నాను. సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి రుణం తీర్చుకుంటా.

– పులివర్తి లక్ష్మి, రాజుపేట

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

- రామకృష్ణాపురంలో రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- 408 మంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు
- ఉచితంగా మందులు పంపిణీ

కోడూరు: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత ప్రజల ముంగిటకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలందిస్తున్నారని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం సచివాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని జెడ్పీటీసీ చెప్పారు. ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటి వద్దకే ప్రజలకు వైద్యసేవలను అందిస్తున్న ప్రభుత్వం, ఇటీవల ఆరోగ్య సురక్ష మొదటి విడత ద్వారా పేదల ఆరోగ్యానికి మరింత రక్షణ కల్పించిందని చెప్పారు.

ప్రస్తుతం రెండో విడత ద్వారా మళ్లీ అన్ని సచివాలయాల పరిధిలో శిబిరాలు కొనసాగుతాయని జెడ్పీటీసీ చెప్పారు. వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సురక్ష శిబిరంలో 408 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించామని ఏఓ పాండురంగారావు తెలిపారు. వైద్యులు శిరీష, లాస్యకృష్ణ, అఖిలాండేశ్వరి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. రోగులకు పలు సూచనలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు చేబోయిన కృష్ణారావు, వెన్నా ప్రసాద్, ఎంపీటీసీ బడే గంగాధరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోడూరు మండలం రామకృష్ణాపురం శిబిరంలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గ్రామస్తులు



వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న జోగి రాజీవ్

చేరువైన వైద్య సేవలు..

మర్రిపాలెం(నాగాయలంక): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో పేద ప్రజలకు వైద్య సేవలు చేరువయ్యాయని ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ అన్నారు. మర్రిపాలెం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు ప్రజలకు వరమని, గ్రామీణ రోగులకు ఎంతగానో మేలు జరుగుతుందని చెప్పారు. శిబిరంలో 320 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు అందజేశారు. నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, పీఏసీఎస్ చైర్మన్లు ముమ్మారెడ్డి చంటి, తోట సాయిబాబు, తహసీల్దార్ జె.విమలకుమారి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

● **గూడూరు:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రజలకు వరమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. మంగళవారం గూడూరు మండలం కంకటావలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావుతో కలిసి రాజీవ్ ప్రారంభించారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు హిమపద్మజ, మహిత, గూడూరు సీహెచ్‌సీ వైద్య నిపుణులు అరుణకాత్యాయని, ఇనాయత్ అలీ, కె.దినేష్ రెడ్డి వైద్యశిబిరంలో 378 మంది రోగులను పరీక్షించారు. అనంతరం కంకటావ, రామానుజవత్తర్లపల్లి గ్రామాలకు చెందిన 950 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచి మద్దాల మోహనరావు, జమదగ్ని, బొర్రా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

● **కృత్తివెన్ను:** ప్రజారోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని మంగళవారం కృత్తివెన్ను మండలం కొమాళ్లపూడిలో నిర్వహించారు. శిబిరంలో 105 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూష, ఎంపీడీఓ పిచ్చిబాబు, వైద్యులు సోనియా, సూర్యతేజ, కార్యదర్శి ఉమామహేశ్వరి, లక్ష్మోజీ తదితరులు పాల్గొన్నారు.

5లోగా విధులకు హాజరుకండి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెను విరమించి జనవరి 5వ తేదీలోగా విధులకు హాజరుకావాలని కలెక్టర్ పి. రాజాబాబు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కేబినెట్ మంత్రులు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలు దఫాలుగా చర్చించి సమ్మెను విరమించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారన్నారు. ఎంతో మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని, ఐదేళ్లలోపు పిల్లలు బరువు తక్కువగా ఉన్నారని, వీరికి పోషకాహారం పంపిణీలో అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మిగిలిన కోర్కెలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో విధులకు హాజరుకావాలన్నారు. జిల్లా పరిపాలనాధికారిగా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. న్యాయమైన కోర్కెలు అన్ని ప్రభుత్వం పరిష్కరించేందుకు కృతనిశ్చయంతో ఉందని, ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లు పరిష్కరించిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. బాలింతలు, గర్భిణులు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు. జనవరి 5వ తేదీలోగా విధులకు హాజరుకాని పక్షంలో ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

క్రీడల్లో ప్రతిభతో మంచి భవిష్యత్

నాగాయలంక: క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి మంచి భవిష్యత్ లభిస్తుందని ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రీడా నైపుణ్యంతో రాష్ట్ర స్థాయికి వెళ్లాలని సూచించారు. మండలంలోని నాలుగు జోన్లలో గ్రామ స్థాయి క్రీడల్లో భాగంగా క్రికెట్ క్రీడాకారులు 608 మంది నమోదు కాగా 38 జట్లుగా పోటీల్లో పాల్గొంటున్నారని, వీటిలో 12 మహిళా జట్లు ఉన్నాయని, మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. తహసీల్దార్ విమలకుమారి, ఎంఈఓ ఎ.రామారావు, పీఆర్ ఏఈఈ వాసుదేవరావు, ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ క్రీడలను నిర్వహిస్తున్నారు.

రసవత్తరంగా క్రికెట్టు పోటీలు..

బంటుమిల్లి: పెదతుమ్మిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రికెట్ పోటీలు మంగళవారం రసవత్తరంగా జరిగాయి. ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా పెదతుమ్మిడి–మల్లపరాజుగూడెం గ్రామాల జట్ల మధ్య పోటీ జరిగింది. పోటీలను ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. క్రీడాభిమానులు స్థానికులు పాల్గొన్నారు.

● **మచిలీపట్నంటౌన్:** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నగరంలోని చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాల, నోబుల్ కళాశాల క్రీడా మైదానాల్లో కబడ్డీ పోటీలు జరిగాయి. చిలకలపూడి హైస్కూల్‌లో ఐదు జట్లు, నోబుల్ కళాశాలలో తొమ్మిది జట్లు మొత్తం 14 జట్ల క్రీడాకారులు కబడ్డీ ఆటలో ప్రతిభ కనబరిచారు. బుధవారం నుంచి నోబుల్ కళాశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను చిలకలపూడి ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్‌కుమార్ పర్యవేక్షించారు.



నాగాయలంకలో క్రికెట్ ఆడుతున్న ఎదురుమొండి క్రీడాకారులు

● **మోపిదేవి:** మోపిదేవి గురుకుల పాఠశాలలో మంగళవారం షటిల్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఈనెల 4, 5, 6 తేదీల్లో మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో చివరిగా క్రికెట్ పోటీలు జరుగుతాయని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటివరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ ఆటలు పోటీలు నిర్వహించగా చివరిగా క్రికెట్ పోటీలు జరగాల్సి ఉందని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. రామకృష్ణ, కె. సత్యనారాయణ, ఎ. శ్రీహరి, ఎ. తాతాజీరావు, వైటీ గాబ్రియేల్ పాల్గొన్నారు.

తీర గ్రామాల్లో వికసిత్ భారత్ గ్రామ సభలు

గుల్లలమోద(నాగాయలంక): తీర గ్రామాలైన గుల్లలమోద, పెదకమ్మవారిపాలెంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర గ్రామ సభలు స్థానిక ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించే దిశగా సభలు నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా క్యాలెండర్లు, బ్రోచర్లు ఆవిష్కరించారు. మండల వ్యవసాయాధికారి ఎ.సంజీవరావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎదురుమొండి వైద్యాధికారి డాక్టర్ ఫాతిమున్నీసా, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రవికుమార్ పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ



నాగాయలంక: గ్రామంలోని 9వ వార్డుకు చెందిన రైతు తలశిల వెంకటేశ్వరరావు (92) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. మృతుని నేత్రాలను తాడిగడప ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి కుమారుడు బాలకృష్ణ, కుమార్తె వేమూరి కృష్ణకుమారి దానం చేశారు. ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ సాయి బృందం మృతుడి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

బీసీల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి

నాగాయలంక: కేంద్రం ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కృషి చేయాలని ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు డిమాండ్ చేశారు. నాగాయలంక మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి, బీసీ నేత నాగిడి తాతారావుతో కలిసి స్థానిక మత్స్య భవనం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2013లో బీజేపీ నాయకులు తాము అధికారంలోకి వస్తే చట్ట సభల్లో బీసీలకు 50 శాతం సీట్లు, బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తామని చెప్పి పూర్తిగా విస్మరించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి పదేళ్లైనా వీటిల్లో ఏదీ అమలుకు నోచుకోలేదన్నారు.

పెన్షనర్ల వితరణ

మచిలీపట్నంటౌన్: 38వ డివిజన్‌కు చెందిన కురిచేటి హనుమంతరావు ఇటీవల మృతిచెందాడు. పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 20 వేలను మృతుని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహస్వామి, పింఛనుదారులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అవనిగడ్డ: పులిగడ్డ అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ పి. జాషువా ఆదేశాల మేరకు డీఎస్పీ పి. మురళీధర్ పర్యవేక్షణలో సీఐ ఎల్. రమేష్ వాహనాలను తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని డీఎస్పీ తెలిపారు. బాపట్ల జిల్లా వైపు వెళ్ళే పలు వాహననాలను పోలీసులు తనిఖీ చేశారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం

బంటుమిల్లి: అర్తమూరు గ్రామంలో సోమవారం రాత్రి దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భవానీ దీక్షలు ముగింపునకు చేరడంతో భక్తులు పెద్దఎత్తున దీపలు వెలిగించి గ్రామ వీధుల్లో కనకదుర్గ నామాలు చెబుతూ ఉత్సవం నిర్వహించారు. అర్తమూరుతోపాటు పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

118 మద్యం సీసాలు స్వాధీనం

చల్లపల్లి: మచిలీపట్నం మండలం అరిసేపల్లి శివారు హుస్సేన్‌పాలెంకు చెందిన యార్లగడ్డ సురేష్ మాజేరులోని జన్యావుల వెంకట సుబ్బారావుకు మచిలీపట్నం నుంచి మద్యం అక్రమంగా చేరవేస్తున్నట్లు సమాచారం రావడంతో మాజేరులో నిఘా వేశామని చల్లపల్లి సీఐ సీహెచ్ నాగ ప్రసాద్ తెలిపారు. సురేష్ కారులో మచిలీపట్నం నుంచి రూ.15,340 విలువ కలిగిన 118 మద్యం సీసాలు తెచ్చి సుబ్బారావు దుకాణం వద్ద దింపుతుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఎస్ఐ చినబాబు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకుని, కారు సీజ్ చేశారు. నిందితులను రిమాండ్ నిమిత్తం మొవ్వ కోర్టుకు తరలించారని సీఐ వివరించారు.

● **నాగాయలంక:** మండలంలోని దీవుల్లో నాచుగుంట గ్రామానికి అక్రమంగా మద్యం తరలిస్తున్న అత్తలూరి శంకరరావును అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. నాగాయలంక ఏటిమొగ రోడ్డు బస్టాండ్ చౌరాస్తా వద్ద సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా శంకరరావు ఎలాంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న 22 క్వార్టర్ మద్యం బాటిల్స్‌తో పట్టుబడ్డాడు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

యానాదుల గృహాల పరిశీలన

కోసూరువారిపాలెం(మోపిదేవి): రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా మండలంలో యానాదులకు కేటాయించి నిర్మించిన పక్కా భవనాలను ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్. ఫణికుమార్ మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న గృహాలకు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించాలని లబ్ధిదారులు కోరారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



